క్లుప్తంగా

విద్యార్థులకు వితరణ



టై, బెల్ట్, బ్యాడ్జీలు పంపిణీ చేస్తున్న దృశ్యం

టేకులపల్లి: బొమ్మనపల్లిలోని మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాలలో కొత్తగూడెం వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ మేరకు శుక్రవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులకు టై, బెల్ట్, బ్యాడ్జీలు పంపిణీ చేశారు. వాసవీ క్లబ్ సీనియర్ బాధ్యులు ముక్కా కనకేశ్వరరావు, చారుగుండ్ల శ్రీమన్నారాయణ, హెచ్ఎం జ్యోతిరాణి తదితరులు పాల్గొన్నారు.

రేపు చాలీసా పారాయణం

కొత్తగూడెంఅర్బన్: విశ్వశాంతి కొరకు హనుమాన్ చాలీసా విరాట్ పారాయణము 27వ తేదీన నిర్వహిస్తున్నట్లు మాస్టర్ ఈకే ఆధ్యాత్మిక సేవా సంస్థ సభ్యులు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యానగర్ కాలనీలోని మాస్టర్ ఈకే విద్యాలయంలో శ్రీ ఆదిత్యహృదయ, శ్రీ విష్ణు, శ్రీ లలిత సహస్రనామ స్తోత్రం, 108 సార్లు శ్రీ హనుమాన్ చాలీసా పారాయణము సామూహికముగా జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి హనుమత్ ఉపాసకులు వాసుదేవానంద భారతి స్వామి వారు వక్కలంక నుంచి రానున్నారని పేర్కొన్నారు. దీంతో పాటు ముఖ్య అతిథులుగా కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, విశిష్ట అతిథిగా జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ హాజరు కానున్నారని తెలిపారు. సర్వజన సంక్షేమమునకై తలపెట్టిన బృహత్తర పారాయణలో అందరూ కుటుంబసమేతముగా పాల్గొని తీర్థ ప్రసాదములు స్వీకరించాలని పేర్కొన్నారు.

మైక్ సెట్ వితరణ



మైక్ సెట్ అందజేస్తున్న దృశ్యం

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం బస్టాండ్ సెంటర్ సమీపంలో ప్రజా కవి జయరాజ్ ఆధ్వర్యంలో నడుస్తున్న, సింగరేణి సాహితీ, సాంస్కృతిక, వికాస, యోగా కేంద్రం (ప్రకృతి ఆశ్రమానికి) సింగరేణి అధికారులు హ్యాండ్ మైక్‌ను వితరణగా అందించారు. శుక్రవారం ఆశ్రమం కోఆర్డినేటర్ సుగుణరావుకు మైక్‌ను అందజేశారు. ఈ సందర్భంగా వారు ఆశ్రమం ద్వారా జరుగుతున్న సేవలను తెలుసుకొని ఆశ్రమ సభ్యులను, నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో జియాలజీ డీవై జీఎం ఎం.చంద్రమౌళి, డ్రిల్లింగ్ డిప్యూటీ జీఎండీ.గోవర్ధన్‌రావు, జియాలజీ డిప్యూటీ జీఎం బి.వీర్రాజు, జియాలజీ డిప్యూటీ జీఎం ఎస్.శ్రీనివాస్, ఎక్స్‌ప్లోరేషన్ సూపరింటెండెంట్ వి.సుమన్ ఉన్నారు.

పోలీసులను ఆశ్రయించిన బాధితులు

సుజాతనగర్: ఆన్‌లైన్‌లో పెట్టుబడి పెట్టి నిలువునా మోసపోయిన రాఘవాపురం గ్రామానికి చెందిన పలువురు బాధితులు స్థానిక పోలీసులను శుక్రవారం ఆశ్రయించారు. రూ.15 వేలు పెట్టుబడి పెడితే ప్రతీరోజు రూ.540 చొప్పున సంవత్సరం పాటు వస్తాయంటూ నమ్మబలికి ఓ యాప్ ద్వారా సుమారు రూ.25 లక్షల మేర మోసపోయిన విషయం విదితమే. ఈ తతంగంలో సుమారు 100 నుంచి 150 మంది ఉండే అవకాశం ఉండగా.. వీరిలో సుమారు 50 మంది వ్యక్తులు పోలీసులను ఆశ్రయించి తమ గోడు వెళ్లబోసుకున్నారు. గ్రామానికి చెందిన సర్వేష్ అనే వ్యక్తి సదరు యాప్ గురించి చెబితేనే డబ్బులు చెల్లించామని బాధితులు అంటున్నారు. గ్రామంలో మీటింగ్ ఏర్పాటు చేసి యాప్ గురించి చెప్పినట్లు వాపోతున్నారు. తమకేమి తెలియదని, పెట్టిన పెట్టుబడి కంటే అధికంగా సంపాదించవచ్చని తమను నమ్మించాడని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బాధితులు ఎవరూ ఫిర్యాదు ఇవ్వలేదని, ఫిర్యాదు ఇస్తే విచారిస్తామని ఈ సందర్భంగా ఎస్సై జుబేదాబేగం తెలిపారు.

బస్‌షెల్టర్ నిర్మాణ స్థలం పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న రామకృష్ణ

జూలూరుపాడు: వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ అభ్యర్థన మేరకు ప్రజల సౌకర్యార్థం మండల కేంద్రంలో బస్‌షెల్టర్, పబ్లిక్ టాయిలెట్లు నిర్మించేందుకు కొత్తగూడెం సింగరేణి సంస్థ ముందుకొచ్చింది. ఇందులో భాగంగా శుక్రవారం సింగరేణి సంస్థ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ సీఓ రామకృష్ణ, పీఆర్ సిబ్బంది జూలూరుపాడులో స్థలాలను పరిశీలించారు. కార్యక్రమంలో మాలోత్ మంగీలాల్ నాయక్, గోపు రామకృష్ణ, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పరిహారం.. కాగితాలకే పరిమితం

- మొండితోగు రోడ్డుకు వీడని గ్రహణం
- పదకొండేళ్లుగా ముందుకెళ్లని పనులు
- అవస్థలు పడుతున్న ప్రజలు





భారీ వర్షాలకు కొట్టుకుపోయిన మొండితోగు - ధర్మాపురం రోడ్డు

ఇల్లెందురూరల్: బ్రిటీష్ పరిపాలన కాలం నుంచే మండలంలోని మొండితోగు గ్రామం మీదుగా మట్టిరోడ్డు ఉంది. రహదారిని అభివృద్ధి చేయాలని దశాబ్దాలుగా ప్రజలు పాలకులకు విన్నవించుకుంటూ వచ్చారు. కనికరించిన నేతలు బీటీ రోడ్డు నిర్మాణం కోసం అనుమతులు మంజూరు చేశారు. పానకంలో పుడకలా.. రోడ్డు నిర్మాణానికి అటవీశాఖ అనుమతులను నిరాకరించింది. క్లియరెన్స్ కోసం సర్వే చేసిన అధికారులు పరిహారం చెల్లింపునను కాగితాలకే పరిమితం చేయడంతో రహదారి నిర్మాణం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉంది.

6.6 కిలోమీటర్ల దూరం..

మొండితోగు గ్రామపంచాయతీకి చారిత్రక నేపథ్యం ఉంది. బ్రిటీష్ పాలన కాలంలోనే ఈ ప్రాంతంలో గ్రీన్ గ్రానైట్ తవ్వకాల పనులు చేపట్టారు. ఆ రోజుల్లోనే బ్రిటీష్ అధికారులు రవాణా కోసం మట్టి రోడ్డు వేశారు. కానీ నేడు అదే రోడ్డుపై బీటీ పరిచేందుకు అటవీశాఖ మోకాలు అడ్డు పెట్టడం ప్రజలను విస్మయానికి గురిచేసింది. ఎట్టకేలకు 2015లో నాటి పాలకులు మొండితోగు గ్రామపంచాయతీలో బీటీ రోడ్డు నిర్మాణానికి అనుమతులు మంజూరు చేశారు. ఆర్అండ్‌బీ రహదారి నుంచి మొండితోగు గ్రామపంచాయతీ పరిధిలో, ధర్మాపురం వరకు 6.6 కిలోమీటర్ల దూరంలో రూ.3.14 కోట్ల వ్యయంతో బీటీ రోడ్డు నిర్మాణానికి అప్పటి ఆర్అండ్‌బీ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అక్టోబర్ 21, 2015లో శంకుస్థాపన చేశారు. కానీ అటవీశాఖ అడ్డుగోడగా నిలిచింది.

2016లోనే పూర్తయిన జాయింట్ సర్వే..

అటవీశాఖ అభ్యంతరంతో పంచాయతీరాజ్, అటవీశాఖల అధికారులు 2016లోనే జాయింట్ సర్వే నిర్వహించారు. రహదారి నిర్మాణం వల్ల 3.9 కిలోమీటర్ల దూరంలో మొత్తం 2.57 హెక్టార్ల భూమి అటవీశాఖ కోల్పోతుందని అంచనా వేశారు. అందులో కోల్పోతున్న అటవీ సంపదను కూడా వెలకట్టి మొత్తంగా రూ.22.80 లక్షలు పరిహారంగా చెల్లించాలని అటవీశాఖ ఉన్నతాధికారులు పంచాయతీరాజ్‌శాఖకు తెలిపారు. ప్రత్యామ్నాయంగా చెల్లించాల్సిన నిధుల మంజూరు కోసం అనుమతి కోరుతూ పంచాయతీరాజ్ శాఖ అధికారులు ఉన్నతాధికారులకు నివేదిక పంపారు. ఆయా నిధుల మంజూరు నాటి నుంచి నేటికీ విడుదల కాకపోవడంతో రోడ్డు పనులు ముందుకు సాగడం లేదు.

ఏటా వర్షాలతో ఛిద్రమవుతున్న రోడ్డు...

2015లో మంజూరైన బీటీ రోడ్డును ఇల్లెందు – గుండాల ఆర్అండ్‌బీ రహదారి నుంచి రెండు కిలోమీటర్ల దూరం బీటీ పర్చారు. మొండితోగు గ్రామంలో 700 మీటర్ల దూరం సీసీ పర్చారు. ఆ తరువాత మిగిలిన 3.9 కిలోమీటర్ల దూరంలో రోడ్డు నిర్మాణం నేటికీ ముందుకు సాగడం లేదు. ఏటా వర్షాలతో క్రమంగా రోడ్డు మరీ అధ్వానంగా మారింది. పంచాయతీలోకి వచ్చిన ప్రతీ ఉన్నతాధికారికి, ప్రజాప్రతినిధికి రహదారి దుస్థితిపై ఆ ప్రాంత ప్రజలు అందజేసిన వినతిపత్రాలు ఏళ్లు గడుస్తున్నా అరణ్యరోదనగానే మిగిలిపోతున్నాయి.

అనుమతి మంజూరు చేయాలి



మొండితోగు గ్రామం నుంచి ధర్మాపురం వరకు అటవీశాఖ అభ్యంతరంతో బీటీ రోడ్డు నిర్మాణ పనులు నిలిచిపోయాయి. ఎనిమిదేళ్ల క్రితం సర్వే చేసి అటవీశాఖకు ఇవ్వాల్సిన పరిహారం నిర్ణయించినా ఫలితం లేకుండా పోయింది. అధికారులు స్పందించి నిధులు విడుదల చేయించి పనులు సాగేలా చూడాలి. – సందిరి రమేష్, మొండితోగు

రోడ్డు లేక ఇబ్బంది పడుతున్నాం..



మొండితోగు నుంచి ధర్మాపురం వరకు రోడ్డు అధ్వానంగా ఉండటం వల్ల రాకపోకలకు ఇబ్బంది పడుతున్నాం. విత్తనాలు, ఎరువుల కొనుగోళ్లు, పంట ఉత్పత్తుల విక్రయం సమస్యగా ఉంటోంది. పిల్లలు బడికెళ్లాలన్నా అవస్థలు తప్పడం లేదు. పాలకులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

– దొడ్డ భాగ్యలక్ష్మి, ధర్మాపురం

నివేదిక అందించాం..



మొండితోగు నుంచి ధర్మాపురం వరకు రోడ్డు అటవీశాఖ పరిధిలో ఉండటంతో సర్వే చేశాం. అటవీశాఖ 2.57 హెక్టార్ల భూభాగం కోల్పోతోంది. దీనికి రూ.22.80 లక్షలు ప్రత్యామ్నాయంగా చెల్లించేందుకు ఉన్నతాధికారులకు నివేదిక ఇచ్చాం. నిధులు విడుదల కాగానే పనులు ప్రారంభిస్తాం.

– రాజు, ఏఈ, పంచాయతీరాజ్‌శాఖ, ఇల్లెందు

మెరుగైన సేవలు అందిస్తాం..



ఇంటర్‌నెట్ సేవలను పరిశీలిస్తున్న తారాచంద్

టేకులపల్లి: టేకులపల్లి మండలంలో బీఎస్ఎన్ఎల్ సిగ్నల్, నెట్‌వర్క్ సేవలు మెరుగు పర్చేందుకు కృషి చేస్తానని బీఎస్ఎన్ఎల్ ఏపీ, తెలంగాణ మొబైల్ టవర్స్ ఇన్‌చార్జ్, కంట్రోలర్ అండ్ కమ్యూనికేషన్ అకౌంట్స్ (సీసీఏ) ఎస్.తారాచంద్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన టేకులపల్లి మండలంలో పర్యటించారు. మండల కేంద్రంతో పాటు మారుమూల గ్రామాల్లో బీఎస్ఎన్ఎల్ సేవల గురించి స్థానికులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం టేకులపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన బీఎస్ఎన్ఎల్ ఇంటర్‌నెట్ సేవలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ గడదాసు రవీంద్రరావు, కార్యదర్శి ఉప్పు దీప్తి, మాజీ సర్పంచ్ బోడ సరిత, బీఎస్ఎన్ఎల్ అధికారులు బానోతు సక్రు నాయక్, సుధీర్, బాలాజీ, అశోక్, ఉదయ్, శివరాంజీ తదితరులు పాల్గొన్నారు.

28న కలెక్టర్ కార్యాలయం ముట్టడి



మాట్లాడుతున్న విశ్వనాథం

సూపర్‌బజార్(కొత్తగూడెం): రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 28న కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలంగాణ రైతు సంఘం (ఏఐకేఎంఎస్) జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చంద్ర నరేంద్రకుమార్, ముత్యాల విశ్వనాథం తెలిపారు. స్థానిక శేషగిరిభవన్‌లో శుక్రవారం జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో వారు మాట్లాడారు. పంట రుణమాఫీ హామీతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిస్థాయిలో రుణమాఫీ చేయకుండా రైతులను మోసం చేసిందని విమర్శించారు. రైతుబంధు స్థానంలో ప్రవేశపెట్టిన రైతుభరోసా పథకం ఊసే లేకుండా పోయిందని దుయ్యబట్టారు. ధరణిని రద్దు చేసి కొత్త రెవెన్యూ చట్టం తీసుకొస్తామని చెబుతున్న ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఈ సమావేశంలో నాయకులు ఏపూరి బ్రహ్మం, సలిగంటి శ్రీనివాస్, గుగులోత్ రాంచందర్, నరాటి రమేష్, సపావత్ రవి, యాస రోశయ్య, సీతారామిరెడ్డి, పద్దం విజయలక్ష్మి, పాండవుల భిక్షం, వాడె లక్ష్మి, కోటి నాగేశ్వరరావు, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

పాదయాత్రను జయప్రదం చేయండి..



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

జూలూరుపాడు: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా దళితుల ఐక్యత కోసం తెలంగాణ మాలమహానాడు రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో భద్రాచలం నుంచి ప్రారంభమైన మాలల మహాపాదయాత్రను జయప్రదం చేయాలని మాలమహానాడు మండల అధ్యక్షుడు బుడిపూడి ప్రభాకర్ పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రం జూలూరుపాడులోని డాక్టర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద పాదయాత్ర కరపత్రాలను ఆవిష్కరించారు. మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధమని, ఎస్సీ, ఎస్టీ కులాలను విభజించడం వల్ల భవిష్యత్‌లో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. పాదయాత్ర ఆదివారం జూలూరుపాడుకు చేరుకోనున్నదని, ఈ యాత్రను విజయవంతం చేసేందుకు పెద్దఎత్తున మాలలు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో ఇల్లంగి తిరుపతి, గడిదేసి కాంతయ్య, పోతురాజు రామారావు, బుడిపూడి ప్రతాప్, కళ్లోజి రవికాంత్, లాజర్, రమేష్, సామేలు, పణితి వెంకటేశ్వర్లు, బాబురావు పాల్గొన్నారు.

చెట్ల కిందే 'సర్కార్' చదువులు



చెట్ల కింద పాఠాలు చెబుతున్న టీచర్

జూలూరుపాడు: మండలంలోని భేతాళపాడు గ్రామ పంచాయతీ రేగళ్లతండా ప్రాథమిక పాఠశాల భవనం శిథిలావస్థలో ఉంది. వర్షం వచ్చినా, రాకపోయినా ప్రమాదకరంగా ఉన్న పాఠశాల భవనంలో విద్యార్థులను కూర్చోబెట్టకుండా ఉపాధ్యాయులు చెట్ల కిందనే విద్యాబోధన చేస్తున్న దయనీయ పరిస్థితి. ఇటీవల జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్ జూలూరుపాడు మండల పర్యటనలో భాగంగా రేగళ్లతండా ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ప్రమాదకరంగా ఉన్న భవనాన్ని చూసిన కలెక్టర్ నూతన భవనానికి నిధులు మంజూరు చేశారు. అయినా సంబంధిత అధికారులు ఎటువంటి చర్యలు చేపట్టలేదు. అధికారులు స్పందించి భవన నిర్మాణ పనులు చేపట్టాలని విద్యార్థుల తల్లిదండ్రులు విజ్ఞప్తి చేస్తున్నారు.

నేడు రైతులకు అవగాహన సదస్సు

జూలూరుపాడు: శనివారం కాకర్ల రైతు వేదికలో మునగ సాగుపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ తాళ్లూరి రవి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సుకు కాకర్ల, మాచినేనిపేటతండా, మాచినేనిపేట, పడమటనర్సాపురం, అనంతారం, గురువాగుతండా గ్రామ పంచాయతీలకు చెందిన రైతులు హాజరు కావాలని కోరారు. ఈజీఎస్ టీఏలు, ఎఫ్ఏలు ఆయా గ్రామ పంచాయతీలకు చెందిన రైతులను అవగాహన సదస్సు తీసుకరావాలని సూచించారు.

'ఉపాధి' తనిఖీ సభ

టేకులపల్లి: ఉపాధి హామీ పథకం ఓపెన్ ఫోరం సభ శనివారం టేకులపల్లి ఎంపీడీఓ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు ఉంటుందని ఎంపీడీఓ గడదాసు రవీంద్రరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. టీఏలు, ఎఫ్ఏలు, ఉపాధి హామీ పథకం సిబ్బంది, ప్రజలు సకాలంలో హాజరు కావాలని కోరారు.

రేపు సదర్ సమ్మేళనం

కొత్తగూడెంఅర్బన్: ఈనెల 27వ తేదీన హైదరాబాద్ ఎన్టీఆర్ స్టేడియంలో అంజన్ కుమార్ యాదవ్, అనిల్‌కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో జరగనున్న సదర్ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని జిల్లా యాదవ సంఘం, కార్మిక సంఘం నాయకులు కోదాడ శ్రీనివాస్‌యాదవ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో పెద్దఎత్తున పాల్గొని, యాదవ సంస్కృతి సంప్రదాయాన్ని చాటిచెప్పే విధంగా విజయవంతం చేయాలని కోరారు.

లెనిన్ ఆచరణ అనుసరణీయం

సింగరేణి(కొత్తగూడెం): రష్యా విప్లవ విజయవంతంలో లెనిన్ ఆచరణ అనుసరణీయమైందని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కెచ్చెల రంగారెడ్డి అన్నారు. లెనిన్ శత వర్థంతి సందర్భంగా కొత్తగూడెంలో పార్టీ జిల్లా కార్యదర్శి ముద్దా భిక్షం అధ్యక్షతన జరిగిన సదస్సులో ఆయన మాట్లాడారు. సోవియట్ రష్యాలో జార్ చక్రవర్తుల పాలనను కూల్చి రష్యా విప్లవాన్ని విజయవంతంలో లెనిన్ గొప్ప పాత్ర పోషించినట్లు చెప్పారు. దేశాధినేతగా ఉన్న కామ్రెడ్ లెనిన్ సామాన్య జీవితాన్ని గడిపి, ముందు తరాలకు ఆదర్శవంతంగా నిలిచారన్నారు. ఈ సదస్సులో గుమ్మడి నర్సయ్య, చంద్ర అరుణ, కెచ్చెల కల్పన, మాచర్ల సత్యం, గోకనపల్లి ప్రభాకర్, రూపురెడ్డి, మధుసూదన్‌రెడ్డి, నూపా భాస్కర్, ఏదులాపురం గోపాలరావు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన

జూలూరుపాడు: వైఆర్‌జీ కేర్, ఖమ్మం ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ బి.వెంకటేశ్వర్లు, వైద్యసిబ్బంది సమక్షంలో ప్రజలకు క్షయ, సుఖవ్యాధులపై అవగాహన కల్పించారు. సూపర్‌వైజర్ కావేరి మాట్లాడుతూ.. హెచ్ఐవీ నాలుగు రకాలుగా కొనసాగుతుందన్నారు. సురక్షితం కానీ లైగింక సంబంధాలు, రక్తమార్పిడి, కలుషిత సూది, ఇంజెక్షన్ల వల్ల హెచ్ఐవీ సోకుతుందన్నారు. హెచ్ఐవీ సోకిన తల్లి జన్మనిచ్చిన బిడ్డకు ఎయిడ్స్ వస్తుందన్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతీఒక్కరు ఏటా ప్రభుత్వాత్రిలో ఎయిడ్స్ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



జీపీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

కొత్తగూడెంరూరల్: లక్ష్మీదేవిపల్లి మండలంలోని శ్రీనగర్‌కాలనీ, ఎదురుగడ్డ, గౌండ్ల రామవరం గ్రామాల్లో రూ.29 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ డ్రెయినేజీ నిర్మాణానికి ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు శుక్రవారం శంకుస్థాపన చేశారు. అదేవిధంగా రూ.20 లక్షల వ్యయంతో నిర్మించిన శ్రీనగర్ కాలనీ గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ప్రతీ గ్రామానికి మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. ఈ ఏడాది రూ.కోట్ల వ్యయంతో రోడ్లు, డ్రెయినేజీలు నిర్మించటం జరిగిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కేవీ ప్రసాద్, ఎంపీడీఓ చలపతిరావు, డీఈ రామకృష్ణ, ఎంపీఓ శ్రీనివాస్, ఎస్‌కే సాబీర్‌పాషా, కంచర్ల చంద్రశేఖర్, లగడపాటి రమేష్ , పూనెం శ్రీను, ఎస్‌కే అన్వర్‌పాషా తదితరులు ఉన్నారు.

కబడ్డీ పోటీలను విజయవంతం చేయండి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

పాల్వంచ: రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పుట్టినరోజు సందర్భంగా ఈ నెల 28, 29, 30 తేదీల్లో కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో జరగనున్న కబడ్డీ పోటీలను విజయవంతం చేయాలని డీసీఎంఎస్ చైర్మన్, రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం పోటీల పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో చీకటి కార్తీక్, నూకల రంగారావు, కొండం వెంకన్న, జానకిరెడ్డి, ముత్తయ్య, మహిపతి రామలింగం, సందుపట్ల శ్రీనివాస్, అయితా గంగాధర్, బద్ది కిషోర్, చింతా నాగరాజు, మిరియాల కమలాకర్, నాగేశ్వరరావు, శ్రీలతరెడ్డి, స్వాతిరెడ్డి, అరుణరెడ్డి, శశి, సదా, ఉపేందర్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

అయోడైజ్డ్ ఉప్పునే వాడాలి..



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ రాజు

పాల్వంచరూరల్: మండల పరిధి జగన్నాథపురం హైస్కూల్‌లో శుక్రవారం జగన్నాథపురం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో అయోడైజ్డ్ ఉప్పు వినియోగంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రాజు మాట్లాడారు. ఆరోగ్యంగా ఉండాలంటే ప్రతీరోజు ఐదు గ్రాముల అయోడైజ్డ్ ఉప్పును వాడాలని సూచించారు. గర్భిణులు అయోడైజ్డ్ ఉప్పును వాడటం వలన బిడ్డ ఎదుగుదల బాగుంటుందని, చిన్నారులకు జ్ఞాపకశక్తి పెరుగుతుందని, శరీరం కూడా చురుకుదనంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ కృష్ణ, అసిస్టెంట్ సూపర్‌వైజర్ శ్రీను, ఏఎన్ఎంలు పద్మ, దివ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

'పోలీసులకు ప్రభుత్వం మొండిచేయి'



మాట్లాడుతున్న కామేష్

కొత్తగూడెంఅర్బన్: కాంగ్రెస్ ప్రభుత్వంలో పోలీసులకు రావాల్సిన సుమారు రూ.50 కోట్ల నిధుల విషయంలో మొండిచేయి చూపుతున్నారని బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యర్రా కామేష్ మండిపడ్డారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ... పోలీసు శాఖలో కానిస్టేబుల్ స్థాయి నుంచి ఎస్పీ వరకు రెండున్నర ఏళ్ల నుంచి టీఏ, డీఏలు, సరెండర్ లీవ్స్, పీఆర్సీ, ఏరియర్స్, జీపీఎస్‌తో పాటు కొత్త పీఆర్సీ రావాల్సి ఉందన్నారు. ఒక్కొకరికి రూ.లక్ష నుంచి రూ.3 లక్షల పైగా సుమారు రూ.5 కోట్ల వరకు దాదాపు 1,600 మందికి పైగా పోలీసులకు రావాల్సి ఉందని చెప్పారు. గత ప్రభుత్వం ఈ విషయంలో నిర్లక్ష్యం చేసిందని, కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అలాగే వ్యవహరిస్తోందని విమర్శించారు. ఉమ్మడి జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉన్నా ఈ విషయంలో విఫలమయ్యారన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి పోలీసులకు రావాల్సిన నిధులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో గంధం మల్లికార్జునరావు, మాలోత్ వీరు నాయక్, వంగా రవిశంకర్, తుంపూరి వీరభద్రం పాల్గొన్నారు.

చెత్తకు నిప్పుపై స్థానికుల ఆగ్రహం



లలితాపురం గ్రామ సమీపంలో రోడ్డు పక్కన తగలబడుతున్న చెత్త



మున్సిపల్ అధికారులతో వాగ్వాదానికి దిగిన లలితాపురం గ్రామస్తులు

ఇల్లెందురూరల్: డంప్‌యార్డులకు తరలించాల్సిన చెత్తను మున్సిపల్ అధికారులు లలితాపురం గ్రామ సమపంలో అనధికారికంగా డంప్ చేస్తున్నారు. సాయంత్రం చీకటి పడే సమయంలో ఆ చెత్తకు నిప్పు పెట్టి అక్కడి నుంచి వెళ్లి పోతున్నారు. ఆ మంటల నుంచి వెలువడే పొగ సమీపంలోని లలితాపురం గ్రామాన్ని కమ్మేస్తోంది. పొగతోపాటు చెత్త నుంచి వెలువడే విషవాయువులు గ్రామస్తులను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. రాత్రివేళ నిద్ర లేకుండా గ్రామస్తులను జాగారం చేయిస్తోంది. దీంతో శుక్రవారం చెత్తడంప్ చేసే సమయంలో కాపు కాసిన స్థానికులు మున్సిపల్ అధికారులు, సిబ్బందితో ఘర్షణ పడ్డారు. డంప్ చేయడం, తగులబెట్టడం తమ తప్పిదంగా అంగీకరించిన అధికారులు వెంటనే కాలిపోతున్న చెత్తపై నీళ్లు చల్లి ఆర్పివేశారు.

ఈ సందర్భంగా లలితాపురం వార్డు మాజీ సభ్యుడు కోటి మాట్లాడుతూ.. చెత్త నుంచి వెలువడే విషవాయువుల వల్ల అనారోగ్య ఇబ్బందులను గతంలో పలుమార్లు మున్సిపల్ పాలకవర్గం, అధికారులకు వివరించామని గుర్తుచేశారు. అయినా వారు అదే పద్ధతి పాటిస్తున్నారని, గ్రామస్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి మున్సిపల్ అధికారుల చర్యలను అడ్డుకోవాల్సి వచ్చిందన్నారు.

త్వరలోనే మోడల్ మార్కెట్ ప్రారంభం



మోడల్ మార్కెట్‌లో పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ డీవీ

ఇల్లెందు: పట్టణంలో మోడల్ మార్కెట్ నిర్మాణ పనులు చివరి దశకు చేరాయని మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు తెలిపారు. మార్కెట్‌లో అంతర్గత రహదారులు, డ్రెయిన్లు, మరుగుదొడ్ల నిర్మాణ పనులను శుక్రవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. పనులు త్వరగా పూర్తిచేసి రెండు వారాల్లో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే కోరం కనకయ్య చేతుల మీదుగా ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేసుస్తున్నామని తెలిపారు.

దీపావళికీ కష్టమే...

ఇల్లెందులో 40 ఏళ్ల క్రితం నిర్మించిన మార్కెట్ స్థానంలో మోడల్ మార్కెట్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. దసరా నాటికే మార్కెట్‌ను అందుబాటులోకి తీసుకునిరావాలని ఆశించినా సాధ్యం కాలేదు. అనంతరం దీపావళికి ప్రారంభించాలని భావించినా అది కూడా జరిగేటట్లు లేదు. టీయూఎఫ్ఐడీసీ నిధులు రూ.8 కోట్లతో మోడల్ మార్కెట్ నిర్మాణానికి 2019 ఆగస్టు 4న శంకుస్థాపన చేసి ఎనిమిది నెలల్లో పూర్తిచేయాలని అనుకున్నారు. నాలుగు బ్లాక్‌ల్లో 24గదుల చొప్పున 192 గదుల నిర్మాణానికి శ్రీకారం చుట్టగా బిల్లుల చెల్లింపుల్లో ఆలస్యంతో పనులు నత్తనడకన కొనసాగుతున్నాయి. ప్రస్తుతం గదుల నిర్మాణం పూర్తయినా అంతర్గత రోడ్లు, డ్రెయిన్లు, మరుగుదొడ్లు, మూత్రశాలల పనులు పెండింగ్ ఉన్నాయి. కాగా, మార్కెట్ అందుబాటులోకి వస్తే షాపులను అద్దెకు ఇవ్వడం ద్వారా మున్సిపాలిటీ రూ.లక్షల్లో ఆదాయం సమకూరి ఆర్థిక ఇబ్బందులు తీరతాయి. అంతేకాక చిరు వ్యాపారులు రోడ్ల వెంట అమ్ముకోవాల్సిన పరిస్థితి ఉండదు.